— రాధిక

"అమ్మా !

"మొన్న నీవు నా దగ్గరకు వచ్చి వెళ్ళావు. నా సంసారం, దాని ఉన్నతి, నేను బ్రతుకుతున్న రీతి చూసి నీ కళ్ళల్లో వెలిగిన మతాబులు నేను మరిచిలేకపోతున్నాను. అలాగే నీవు నా సవతి కూతురు సుమ్మవైపు చూసిన చూపు, ఆమెను ప్రేమగా చూడవద్దని నాకు చేసిన హితబోధ, అర్థింపు కూడా మరువలేకున్నాను.

"అమ్మా ! నేను అతి సామాన్యమైన - మధ్య తరగతికి దిగువనున్న కుటుంబంలో పుట్టాను. నా కున్న అదృష్టం అందం. నా వరం అణకువ. ఈ రెండే నన్ను ఈ ఇంటి ఇల్లాలిని చేశాయి. మనమున్న పరిస్థితిలో నీవు నాకు పెళ్ళి కాదుకదా, సడన్‌గా ఏ ఏక్సిడెంట్‌లోనో చనిపోతే కనీసం చావును కూడా జరిపే స్థితిలో లేవు. ఇలా రాశానని బాధపడకు. నిజాలలో ఎప్పుడూ వ్యధలే ఉంటాయి. సుధలు, మధుర కథలు ఉండవు.

"తోటలో పూసిన పూలన్నీ దేవుని గుడిలోకి వెళ్ళవు. కొన్ని ఆడవారి జడలోకి మెడకు ఉరి బిగించుకొని, మరి కొన్ని రసికుల కౌగిలిలోకి కన్నీరు నింపుకొని వెళతాయి. ఏ ఒక్క దానికో పూర్వజన్మ సుకృతమో, ఈ జన్మలో చేసిన వ్రత ఫలితమో దేవుని పాదాల చెంతకు వెళ్ళే యోగం కలుగుతుంది. అలాంటి యోగం కలిగిన పువ్వులాంటి స్త్రీని నేను, ప్రస్తుతం.

"కలలో కూడా ఇంతటి ఐశ్వర్యాన్ని మనం అనుభవించడానికి కాదు కదా, తలవడానికి కూడా తగని చోట పుట్టాం. అటువంటి ఇంట్లోని నాకు ఏ దేవుడో కరుణించి, మోహన్‌కు భార్యనయ్యే అదృష్టం కలిగించాడు. అమ్మా ! పెళ్ళి, ఐశ్వర్యం మాత్రమే కాదు ఆడదానికి కావలసింది. ప్రేమ కూడా. అది నిండుగా నాకు దొరికింది.

"అందుకే నా జీవితం కనులపండువుగా ఉంది. జీవితంలో నేను ఇంతటి అదృష్టవంతురాలిని అవుతానని ఏనాడూ అనుకోలేదు. నా జీవితంలో అసలైన అదృష్టం ఈ పెళ్ళి, ప్రేమా కాదు. మోహన్ మంచితనం. నడి సముద్రంలో ఈత రాక ఈదులాడుతున్న మనని ఓడలా వచ్చి ఆదుకొని నీడ నిచ్చాడు. నాన్నగారికి మంచి వైద్యం, తమ్ముడికి పెద్ద ఉద్యోగం, చెల్లెలి పెళ్ళి, ఇల్లు తాకట్టు నుంచి విడిపించడం - ఇవన్నీ మనకు ఈ జన్మలో జరిగేవేనా? మోహన్ లేకపోతే ఇప్పటికి మనం ఎలా ఉండేవాళ్ళమో ఊహించు. నాన్నగారు దగ్గుతూ, నేను ఉద్యోగాల వేటలో అలసిపోతూ, తమ్ముడు రౌడీ ఫ్రెండ్స్‌తో కలసి రోడ్లు సర్వే చేస్తూ, చెల్లి ఇంటి పనిలో సతమతమవుతూ చిరిగిన బట్టలతో, తరిగిన ఓపికతో ఉండేవారం.

> "జరిగిన కారు ప్రమాదంలో నీ క్లయింట్ తప్పులేదని ఎలా చెప్పగలవ్?" అడిగాడు జడ్జి.
>
> "అతను తాగి నడిపిన మాట నిజమే - కాని నడిపింది తన కారు కాదు కాబట్టి" వాదిస్తూ అన్నాడు లాయర్.
>
> వాలి వీణామాధురి
>
> [హైదరాబాదు]

"ఆకస్మికంగా మన జీవితంలో ఇంత మార్పు రావడానికి కారణం మోహన్ కాదమ్మా, సుమ్మ ! అసలు సుమ్మ లేకపోతే మోహన్ నన్ను చేసుకునే వారా? ఆయనకు కోటిమంది కానులతో సహా దొరికేవారు. సవతితల్లి సరిగా చూడదని, నా మంచితనం వల్ల, సుమ్మను జీవితాంతం ప్రేమగా చూడగల ననే నమ్మకం వల్ల నన్ను చేసుకున్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయలేను. మన కుటుంబ పరిస్థితులు ఇంత మంచి దశకు రావడానికి కారణం సుమ్మే అమ్మా. అలాంటి సుమ్మకు నా స్వార్థంతో అన్యాయం చేయలేను. నాకు పిల్లలు పుట్టనీ, ఈ లోకం తలకిందులు కానీ. నాలో ఊపిరి ఉన్నంత వరకూ సుమ్మను అత్యధికంగా ప్రేమిస్తాను. ఆ చిన్నారి తన తల్లిని పోగొట్టుకున్న దౌర్భాగ్యానికి, మన కింత భాగ్యం కలిగింది. ఇప్పుడు నేను మోహన్ ఇల్లాలిగా అధికారం చలాయించలేను. చలాయించినా, మోహన్ ఏమీ చేయలేరు. కాని మన జీవితాల్ని అన్ని విధాలా ఆదుకోవడానికి కారణం కేవలం ఆ తల్లిలేని పిల్లే. ఆ అమ్మాయిని నేను ప్రేమగా చూడడం కోసం మోహన్ నాతో అనంతమైన అనురాగానికి కట్టుబడి, మీ కెంత డబ్బు పెట్టుబడి పెట్టారు ! ఇదంతా సుమ్మ భిక్షే నమ్మా ! ఆ పసిదానిమీద నీవు కక్ష పెట్టుకొని నాకేమీ నూరిపోయొద్దు. నీవు నాలాగే సుమ్మను ప్రేమించగలిగితే ఎంతో సంతోషిస్తాను. ప్రేమతో నీ కుమార్తె మాధురి."

*




